క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



బిక్కవోలు ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కొలువైన శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. మార్గశిర మాసం మంగళవారం సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాస్కర్, సిబ్బంది ప్రసాద్, సత్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతికి కృషి

రాజానగరం: గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధిని సాధిస్తేనే రాష్ట్రం, తద్వారా దేశం ప్రగతి పథాన పయనిస్తాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం భవనంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 'గ్రామ పంచాయతీ సుస్థిరాభివృద్ధి ప్రణాళిక' అనే అంశంపై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సమస్యలు వంటి వాటిని పరిష్కరించే దిశగా పటిష్ట ప్రణాళికలను తయారు చేయడం ద్వారా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎంపీడీఓ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి డీసీ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి

పెదపూడి: అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా అనపర్తి సాగునీటి సంఘం అధ్యక్షుడు తమలంపూడి సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అనపర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధురి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అనపర్తి, బిక్కవోలు, బలభద్రపురం, కడియం, జి.మేడపాడు, సాగునీటి సంఘాల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డిని డీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఆయనకు ఎన్నికైన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



ఇల్లపల్లిలో స్టడీ మెటీరియల్ అందుకున్న పదో తరగతి విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సమకూరినట్లు ఇలపల్లి పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం వేట్లపాలెం గ్రామానికి చెందిన శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు 90 మంది విద్యార్థులకు వీటిని ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు.

కోళ్ల దొంగల అరెస్టు

బిక్కవోలు: ఈ నెల 15వ తేదీన రంగాపురం గ్రామంలోని కోడి పుంజుల చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 15వ తేదీన రంగాపురం గ్రామానికి చెందిన కొమరపు ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన నువ్వల అభిషేక్, కొమరపు సంతోష్, గొల్లపల్లి నానాజీ కోడి పుంజులను చోరీ చేసినట్లు గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

రంగంపేట: సారా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వాసంశెట్టి శ్రీను 30 లీటర్ల సారా కలిగి ఉండడంతో సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. వడిశలేరు గ్రామంలో బత్తిన బూరమ్మ 10 లీటర్ల సారా కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్టు తెలిపారు. సారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పశు పోషణ భారం..!



పెదపూడిలో పొలంలో ఎండుగడ్డిని ఒబ్బిడి చేస్తున్న కూలీలు



మోపులను తరలిస్తున్న కూలీలు

- యంత్రాల కోతతో ఎండుగడ్డికి కొరత
- ట్రాక్టర్ లోడు రూ.8 వేల పైమాటే
- మూగజీవాల మేతకు ఇబ్బందులు



ట్రాక్టర్‌పై తరలింపు

పెదపూడి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఓ వైపు అన్నదాతకు మేలు చేస్తున్నా.. మరోవైపు మూగజీవాలకు అనర్థంగా మారింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులు యంత్ర సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ప్రయోజనాలను కాదనలేం. అయితే మరోవైపు కొన్ని ఇబ్బందులు సైతం ఉత్పన్నమవుతున్నాయి. గతంలో వరి కోతలు కూలీలు చేపట్టడంతో ఎండుగడ్డి పుష్కలంగా పశువులకు దొరికేది. రెండు పంటల ద్వారా వచ్చిన గడ్డిని పశువుల మకాం వద్ద మేట వేసుకుని దాణాకు వినియోగించేవారు. కూలీల కొరత, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటం, సకాలంలో పంటను దక్కించుకోవాలనే తాపత్రయంతో రైతులు యంత్ర సహాయంతో వరికోతలకు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో పశువులకు ఎండుగడ్డి సమస్య, కొరత ఏర్పడింది. పశుపోషణకు పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఎండు గడ్డికి గిరాకీ ఏర్పడింది. యంత్రాలతో వరి పంటను ఒబ్బిడి చేయడంతో ఎండు గడ్డి దాదాపుగా రైతులకు దక్కడం లేదు. యంత్రాలతో కోసిన పొలాల్లో బాటలుగా ఉన్న ఎండు గడ్డిని పాడి రైతులు పోగేసుకుని దానిని పశువుల మకాం వద్దకు, పొలం దిమ్మలకు తరలించుకుంటున్నారు. తొలకరి గడ్డిని పాడి రైతులు పశువుల మేతకు ఎక్కువగా వినియోగించడం కూడా ఎండుగడ్డి కొరతకు ప్రధాన కారణం.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల పరిధిలోని అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఖరీఫ్‌లో 95,933 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ప్రాంతాల్లో సుమారు 85 శాతం మేర వరికోతకు యంత్రాలు వినియోగిస్తున్నట్లు అంచనా. ఈ కోతలతో దాదాపు 60 శాతంపైగా ఎండు గడ్డి వృథా అవుతోంది. ఈ రెండు నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో గేదేలు సుమారు 80,657 ఉండగా, ఆవులు 32,420 వరకు ఉన్నాయి. సుమారు 13 వేల మంది పాడి రైతులు ఉన్నారు. పశువులకు నిత్యం ఎండు, పచ్చగ్రాసంతో దాణా పెడుతుంటారు. ఒకరోజులో పశువుకు ఇంచుమించు 5 కేజీల ఎండుగడ్డి, 15 కేజీల పచ్చగ్రాసం అవసరం ఉంటుందని పశు వైద్యులు చెబుతున్నారు.

అధిక పాల దిగుబడి

ప్రస్తుతం ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.8 వేలు పలుకుతోంది. పొలంలో కూలీలతో వరికోత కోయించి ఒబ్బిడి చేసిన ఎండుగడ్డి ఎకరం ధర రూ.4, 500 పలుకుతోంది. గతంలో రూ.6 వేలకు వచ్చే ట్రాక్టర్ ఎండుగడ్డి ధర భారీగా పెరిగింది. ప్రస్తుతం యంత్రంతో కోసిన ఎండుగడ్డి పొలంలో ఉంటే దాని ధర రూ.1500 వరకు ఉంది. ఆ ఎండు గడ్డిని పొలంలో గుట్టలుగా పోగు పెట్టడానికి, పోగుపెట్టిన ఎండుగడ్డిని ట్రాక్టర్, లేదా పొలం దిమ్మలపై వేయడానికి మరో రూ.2,500 ఖర్చవుతోంది. ఒక ఎకరం నుంచి రెండెకరాల లో పండిన పంటి ఎండుగడ్డిని ఒక ట్రాక్టర్‌కు లోడు వేస్తారు. ఆ ట్రాక్టర్ ఎండుగడ్డిని వేరే ప్రాంతానికి తరలించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎండుగడ్డి ధర సుమారు రూ.8 వేలకు చేరుతోంది. ఎండు గడ్డితో పాలలో చిక్కదనం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. యంత్రాల వినియోగం పెరిగి, అవసరమైన గడ్డి అందుబాటులో లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

రాయితీపై పచ్చగడ్డి విత్తనాలు

> యంత్రాలతో వరి కోతలు కోయడంతో ఏర్పడుతున్న ఎండుగడ్డి కొరతను నివారించడానికి ప్రభుత్వం దృష్టి సారించింది. సంపూర్ణ సమీకృత దాణాలో భాగంగా జొన్న, మొక్కజొన్న, బొబ్బర్లు మొదలైన పచ్చగడ్డి విత్తనాలను రాయితీపై రైతులకు సరఫరా చేస్తున్నాం. దీనిపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> సాయి, మండల పశు వైద్యాధికారి, పెదపూడి మండలం

వీడియోగ్రాఫర్లకు ఊరట



వీడియో, ఫొటోగ్రాఫర్లకు బకాయి సొమ్ము అందిస్తున్న ఆర్డీఓ

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో విధులు నిర్వర్తించిన వీడియో, ఫొటోగ్రాఫర్లు తమ బిల్లులకు సంబంధించిన బకాయిలు సకాలంలో అందకపోవడంతో వీడియో, ఫొటోగ్రాఫర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో వారి ఇబ్బందులను గ్రహించిన ఆర్డీఓ కృష్ణనాయక్ చొరవ తీసుకోవడంతో కొంత మొత్తాన్ని మంగళవారం వారు అందుకున్నారు. ఎనిమిది నెలల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసి, ఎన్నికల ప్రక్రియను రికార్డు చేసి, అధికారులకు అందించారు. అందుకు సంబంధించిన బిల్లులను వీడియో, ఫొటోగ్రాఫర్లు ఆయా అధికారులకు అందజేసినప్పటికీ సొమ్ము మంజూరు చేయలేదు. మండల స్థాయిలో అనేక ఇబ్బందులు చూసిన వారు విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లడంతో సొమ్ము వచ్చాయని వారు ఆర్డీఓకు కృతజ్ఞతలు తెలిపారు.

శివారుకూ సాగునీరందిస్తాం..

మధురపూడి: పుష్కర ఆయకట్టులోని శివారు భూములకు సాగు నీరందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని పుష్కర ప్రధాన కాలువ నీటి పంపిణీ వినియోగదారుల సంఘ అధ్యక్షుడు అడబాల వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు అడపా వీరబాబు అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం కాపవరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

వైభవంగా కనకదుర్గమ్మ తీర్థం



కనకదుర్గమ్మ వారికి పూజలు



సూర్యారావుపేట జంక్షన్ వద్ద అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని సూర్యారావుపేట జంక్షన్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ వారి తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. సూర్యారావుపేట, చక్రద్వారబంధం గ్రామస్తుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాస్త నెమ్మదిగా ఉన్నా రాత్రి సమయంలో భక్తుల రద్దీ అధికమైంది. పక్కనే ఉన్న కాకినాడ జిల్లా గండేపల్లి మండలం, మురారిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ కనకదుర్గమ్మ వారి తీర్థ మహోత్సవాలు జరుగుతాయి. అక్కడ నుంచి సాయంత్రం వేళ ఆ ప్రాంతాల్లోని భక్తులు సూర్యారావుపేటకు వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం పరిపాటి. దీనితో పగలు కంటే రాత్రి సమయంలోనే ఇక్కడ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు, పోలీసుల సహకారంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలోకి భారీ వాహనాలను అనుమతించకుండా రూట్ మళ్లించారు. అలాగే జాతీయ రహదారిపై భద్రతా చర్యలు తీసుకున్నారు. స్థానిక సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో రాజానగరం, బొమ్మూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులను వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అలాగే తోకాడ, పాతతుంగపాడులలోని కనకదుర్గమ్మ వారి తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భారతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరేంద్రరెడ్డి



బిక్కవోలులో శిక్షణనిస్తున్న అధికారులు

సీతానగరం: ఐక్యరాజ్య సమితి రూపొందించిన కార్యక్రమంలో భాగంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, విద్య, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఫారెస్ట్ తదితర శాఖలతో నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమంలో 2030కు మానవాభివృద్ధిలో మనం చేరుకోవాల్సిన లక్ష్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. దీనిపై మండల, గ్రామ స్థాయిల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. 2030 నాటికి ప్రపంచ ప్రసూతి మరణాల నిష్పత్తిని, మాతృ మరణాలు 70 శాతం కంటే తగ్గించాలన్నారు. నవజాతి శిశువులు, ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలు పూర్తిగా లేకుండా చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించాలన్నారు. ప్రతి ఒక్కరికీ విద్యనందించాలని, పరిసరాల శుభ్రత నూరు శాతం సాధించాలన్నారు. అందరూ ఉపాధి, ఆర్థిక పరిపుష్టి సాధించాలనే లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీఎస్ఎస్ ప్రకాష్, ఏపీఓ కె.నాగ శేషవేణి, ఏపీఎం జిలాని, పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా సాగాలి

పెదపూడి: సుస్థిర గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి గ్రామాభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో లభించే వనరులను అవసరాలకు మాత్రమే పొదుపుగా వాడుకొని భవిష్యత్ తరాలకు దాచి ఉంచాలనేదే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. గ్రామాలను పేదరికం, ఆహార కొరత, లింగవివక్షత, అసమానతలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ లక్ష్యాల సాధనలో అంతా పరస్పర సహకారం అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి, సచివాలయ కార్యదర్శులు కనక నాగేంద్ర కుమార్, బి.ప్రసన్నకుమార్, ఏపీఎం వి.అరుణ కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, మన్యం శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో..

గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అనపర్తి ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సుస్థిర గ్రామాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను అధికారులు, ప్రజా ప్రతినిధులు తయారు చేయాలన్నారు.

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

బిక్కవోలు: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బందితో సుస్థిర గ్రామాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. పారిశుధ్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాన్ మిల్టన్, కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి, పందలపాక సర్పంచి సబ్బారపు పద్మావతి, కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకటరమణ, బలభద్రపురం సర్పంచి బుంగా రామారావు, మెళ్లూరు సర్పంచి సాయి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



కోరుకొండలో సత్కారం అందుకున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు



అనపర్తిలో పెన్షనర్లను సన్మానిస్తున్న అధికారులు

మధురపూడి: జాతీయ పెన్షనర్ల డే సందర్భంగా కోరుకొండలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తొమ్మిది మంది విశ్రాంత ఉద్యోగులను మంగళవారం సత్కరించారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో సంఘ కార్యాలయం వద్ద 75 ఏళ్లు పూర్తయిన వారికి సత్కారం చేశారు. వీరందర్నీ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి గణేష్, ఎస్టీఓ రజనీలు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గొల్లపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభుదాసు, కార్యదర్శి హ్యూమర్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సత్కారం

పెదపూడి: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ అధ్యక్షుడు పీవీఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్లకు డీఎస్ నకారా చిరస్మరణీయుడన్నారు. తొలుత సంఘ పతాకాన్ని సబ్ ట్రెజరీ అధికారి జి.ద్రాక్షాయణి ఆవిష్కరించారు. అనంతరం పలువురు పెన్షనర్లను సన్మానించారు.

ఆటపాటలతో బోధనకు ప్రాధాన్యమివ్వాలి



శిక్షణను పరిశీలిస్తున్న రంగయ్య

రాజానగరం: ప్రాథమిక విద్యలో ఆటపాటలతో కూడిన బోధనకు ప్రాధాన్యమివ్వాలని ఎస్‌సీఈఆర్‌టీ సైకాలజిస్ట్ కో ఆర్డినేటర్ ఆర్.రంగయ్య అన్నారు. కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒకటో తరగతి విద్యార్థికి ఉపాధ్యాయుడు అతని స్థాయి వెళ్లి బోధించాలని, అప్పుడే ఆ విద్యార్థి అభ్యసనా స్థాయిని చేరుకోగలుగుతాడన్నారు. విద్యార్థికి ఎనిమిదేళ్ల వయస్సును ప్రారంభ సంవత్సరాలుగా పేర్కొంటారన్నారు. ఆ దశలో విద్యార్థి మానసిక వికాసం వేగంగా ఉంటుందన్నారు. శిక్షణలో ఉపాధ్యాయులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 278 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారని శిక్షణా కేంద్రం కోఆర్డినేటర్ పి.రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో డైట్ అబ్జర్వర్ దొండపాటి సుధారత్నం, కేఆర్‌పీలు కె.గంగాధరరావు, ఎం.రాంబాబు, వెండర్ పవన్, డీఆర్పీలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



పాతతుంగపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



వడిశలేరు రెవెన్యూ సదస్సులో రైతు సమస్య తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


రాజానగరం: భూ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని పాతతుంగపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భూ సంబంధ అంశాలపై ఎంతోమంది కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారన్నారు. ఇటువంటి వాటికి శాశ్వత పరిష్కారం చూపడంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తులను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాతతుంగపాడు సదస్సులో నాలుగు దరఖాస్తులొచ్చాయన్నారు. సదస్సులో ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి పేర్కొన్నారు. మండల పరిధిలోని వడిశలేరు సచివాలయం-2 పరిధిలో తహసీల్దార్ కోసు అనసూయ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను తెలుసుకున్నారు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ కోసు అనసూయ మాట్లాడుతూ గ్రామంలో గల సచివాలయం-1లో 35, సచివాలయం-2లో 18 కలిపి మొత్తం 53 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ దినేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారమే లక్ష్యం

బిక్కవోలు: భూ వివాదాల పరిష్కారానికి గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులే వేదికలని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన బలభద్రపురం గ్రామంలోని రెవెన్యూ సదుస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సదస్సుకు రైతులు హాజరు కావాలన్నారు. రెవెన్యూ రికార్డులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వచ్చి వారి వివరాలను రికార్డుల్లో పరిశీలించు కోవాలన్నారు. రికార్డుల్లో తప్పులు ఉంటే వెంటనే తెలియ జేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, వీఆర్వో మాచవరపు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, ఆలయ ఈవో రామలింగ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎంపికైన పీఎంపీ అసోసియేషన్

పెదపూడి: అనపర్తి, బిక్కవోలు మండలాల కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ) నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. అనపర్తి ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షతన ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వాసంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శిగా డి.సాయి రామారెడ్డి, కోశాధికారిగా నీలంశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్‌వీ రామారావు, సహాయ కార్యదర్శిగా పీటీఎల్ నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఎస్ చలం ఎన్నికైనట్లు శ్రీనివాసరావు చెప్పారు. అనంతరం నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సులో రాజమహేంద్రవరానికి చెందిన సత్య కిడ్నీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య నిపుణుడు ఎస్ సత్యప్రసాద్ పలు రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, రాయవరం మండల కన్వీనర్ ఎస్‌వీ.రమణ, కేఎస్ఎస్‌మూర్తి పాల్గొన్నారు.

కొమరిపాలెం డీసీ అధ్యక్షుడిగా వేణుగోపాలరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం నీటి పంపిణీ విభాగం చైర్మన్‌గా కొంకుదురు నీటి సంఘం చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొమరిపాలెం నీటి సంఘం అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డిని ఎన్నుకున్నారు. మంగళవారం కొమరిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన ఈ ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం వారికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ఆనందరావు, తహసీల్దార్ కృష్ణ, మాజీ జెడ్పీటీసీ పడాల రాము, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, పందలపాక నీటి సంఘం అధ్యక్షుడు వల్లూరి ఫణి, పందలపాక సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.